వాట్సాప్‌లో రైస్‌కార్డు సేవలు

- కార్డులో మార్పుచేర్పులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు
- మొత్తం ఎనిమిది రకాల సేవలు అందుబాటులోకి..
- కొత్త కార్డు కోసం ఆప్షన్ లేకపోవడంపై అసంతృప్తి

- వార్త 7వ పేజీలో..

కమ్ముకున్న కారుమబ్బులు

పట్టణంలో శనివారం ఉదయం కారుమబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. ఉదయం 9 గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని భారీ వర్షానికి సూచనగా ఆకాశమంతా మేఘాలు అలుముకున్నాయి. పట్టణంలోని గృహ సముదాయాలకు గొడుగు పట్టినట్టు మేఘాలు అబ్బురపరిచాయి. అయితే కొద్ది నిమిషాల పాటు తేలికపాటి జల్లులు పడి.. వర్షం హడావిడి సద్దుమణిగిపోయింది.

- నర్సీపట్నం/ఆంధ్రజ్యోతి



కారుమబ్బులు కమ్ముకున్న దృశ్యం

ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్

యుక్తధార యాప్‌తో పనుల పర్యవేక్షణ

- జిల్లాలో పూర్తి స్థాయిలో అమలుకు సన్నాహాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలులో చోటు చేసుకుంటున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసి, మరింత పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించే నిధుల ఖర్చు విషయంలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్రమాలు అరికట్టి పారదర్శకంగా పథకాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యుక్తధార యాప్‌ను తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే పనుల గుర్తింపు దగ్గర నుంచి పనులకు వచ్చే శ్రామికుల వివరాలు, బిల్లుల చెల్లింపులు అన్ని వ్యవహారాలు ఈ యాప్ ద్వారానే జరగనున్నాయి.



సబ్బవరంలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

ఉపాధి పనులను జియోట్యాగ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పనులకు వచ్చే శ్రామికుల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగ్ చేసిన పనుల వద్ద మాత్రమే శ్రామికులు పనులు చేయాల్సి ఉంటుంది. శ్రామికులు పనులు చేస్తున్నట్టు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతి పాటించడం వల్ల రాష్ట్రంలో ఏ మారుమూల మండలం, గ్రామంలో జరిగే ఉపాధి పనులనైనా యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. యాప్‌లో అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల అవకతవకలకు అవకాశం ఉండదు. అలాగే శ్రామికులకు సకాలంలో వేతనాలు విడుదల అవుతాయి. జిల్లాలోని 24 మండలాల్లో 645 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ పథకంలో పనిచేసేందుకు జిల్లాలో 2.93 లక్షల మంది శ్రామికులు నమోదయ్యారు. వీరిలో 2.81 లక్షల మందికి జాబ్ కార్డులు జారీ చేశారు.

గ్రామస్థాయిలో ప్రణాళికలు సులభతరం

యుక్తధార యాప్ వినియోగం ద్వారా గ్రామ స్థాయిలో ఉపాధి పనుల ప్రణాళికలు రూపొందించడం మరింత సులభతరం అవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఈ యాప్‌ను వినియోగిస్తూ ఒక పంచాయతీలో పనులు చేపడుతున్నామన్నారు. యాప్‌పై అవగాహన కల్పించేందుకు ఉపాధి హామీ మండల, గ్రామ స్థాయి సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లో యుక్తధార యాప్‌ను వినియోగించడం ద్వారా ఉపాధి పనుల గుర్తింపు, చెల్లింపులు జరుపుతామని తెలిపారు.

ఇసుక దందాకు అడ్డేలేదు

శేమునాపల్లిలో కొనసాగుతున్న తవ్వకాలు

- ఒక రోజు విరామం ఇచ్చి.. మళ్లీ మొదలు
- శారదా నదికి తూట్లు.. ఒడ్డున ఎడతెగని విధ్వంసం
- ఎక్స్‌కవేటర్లతో తవ్వి విశాఖకు తరలింపు
- అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు



శేమునాపల్లి ప్రాంతంలో శనివారం తిరిగి ప్రారంభమైన ఇసుక రవాణా

చోడవరం, మే 24(ఆంధ్రజ్యోతి):

మండలంలోని శేమునాపల్లి పంచాయతీ పరిధిలో ఇసుక దందా దర్జాగా కొనసాగుతోంది. శుక్రవారం జనసేన నాయకుల పర్యటన కారణంగా ఒక్క రోజు తవ్వకాలు నిలిపివేసిన అక్రమార్కుడు.. తిరిగి శనివారం నుంచి యథావిధిగా ఇసుక దందా కొనసాగిస్తుండడం విశేషం.

చోడవరం మండల శివారు. కె.కోటపాడు మండల సరిహద్దులో చౌడువాడకు సమీపంలో ఉన్న శేమునాపల్లి వద్ద అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి శారదా నది ఒడ్డున కొద్ది రోజులుగా ఇసుక దందా కొనసాగిస్తున్నారు. యంత్రాలతో నది ఒడ్డున భూములను విచ్చలవిడిగా తవ్వి లారీలు, ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. దీంతో శేమునాపల్లిలో ఇసుక దోపిడీ మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లుగా చలామణి అవుతోంది. రెండు మండలాల పరిధిలో ఇటు లక్కవరం, శేమునాపల్లి, రాయపురాజుపేట, అటు కె.కోటపాడు మండలం శివారు గ్రామాలైన మల్లంపాలెం, కొల్లువీధి పరిసరాల మీదుగా శారదా నది వెంబడి సాగుతున్న ఈ విధ్వంసంతో శారదా నది రూపురేఖలే మారిపోతున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. శేమునాపల్లిలో అనకాపల్లికి చెందిన వ్యాపారి నది ఒడ్డున ఇసుక దిబ్బలు కొనుగోలు చేసి, పనిలో పనిగా నది గట్లను కూడా ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్న తీరుతో శారదా నది ప్రవాహం కూడా మారిపోయే ప్రమాదం నెలకొంది. ఈ విచ్చలవిడిగా ఇసుక దోపిడీతో నదిలో ఉన్న సాగునీటి కాలువలు కూడా ధ్వంసం కావడంతో నది వెంబడి భూములకు సాగునీరు దొరకని పరిస్థితి నెలకొంది. వాగులను, నది గట్లను ధ్వంసం చేసి మరీ ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు. నది వెంబడి ఉన్న పెద్ద పెద్ద గట్లను, అందులోని చెట్లను కూడా కూలగొట్టి ట్రాక్టర్లతో రాత్రీ పగలూ తేడా లేకుండా విశాఖకు ఇసుక తరలించుకుపోతున్నా, ఈ విషయం తమకేమీ తెలియదన్నట్టుగానే ఇటు చోడవరం, అటు కె.కోటపాడు మండల ... మిగతా 6వ పేజీలో



తరలింపునకు సిద్ధంగా ఉంచిన ఇసుక

అనగనగా..

కథలతో చిన్నారుల్లో మనోవికాసం

- ఏకాగ్రతను, జిజ్ఞాసను పెంచడంలో కథలు కీలకంగా నిలుస్తాయంటున్న నిపుణులు
- భాషపై పట్టు పెరగడంతో పాటు విశ్లేషణాత్మక గుణం అలవడేందుకు అవకాశం
- ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ నుంచి దూరంగా ఉంచేందుకు, మంచి నిద్రను అందించేందుకు దోహదం
- తల్లిదండ్రులు సమయం వెచ్చించడం అవసరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"అనగనగా ఒక రాజు...ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురూ వేటకు వెళ్లారు. ఏడు చేపలు తెచ్చారు..." ఇలా ఒకప్పుడు పిల్లలకు అమ్మమ్మో, నానమ్మో, తాతయ్యో చందమామను చూపిస్తూ కథలు చెప్పేవారు. అలా కథలు వింటూనే పిల్లలు నిద్రపోయేవారు. కథలు నిద్ర పుచ్చడానికి మాత్రమే కాదు, పిల్లల్లో జిజ్ఞాసను, ఊహాశక్తిని పెంపొందించేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇంట్లోని పిల్లలందరినీ ఒకచోట కూర్చోబెట్టి పెద్దవాళ్లు కథలు చెప్పేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్యోగాలు, వ్యాపారాల్లో నిమగ్నమయ్యే తల్లిదండ్రులు...పిల్లలతో గడిపేందుకు సమయం కూడా కేటాయించడం లేదు. ఇక, కథలు చెప్పడానికి అవకాశం ఎక్కడ?. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఇచ్చి...పరోక్షంగా వారు మానసిక సమస్యల బారినపడేలా చేస్తున్నారు.



కథలు పిల్లల మానసిక వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ పడుకునే ముందు చెప్పే కథలు కొన్ని ఏళ్లపాటు పిల్లల మెదళ్లలో కదలాడుతుంటాయి. రోజువారీ చెప్పే కథలు పిల్లల్లో ఊహాశక్తిని పెంపొందించడంతోపాటు భాషా వికాసానికి ఉప యోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

వ్యక్తిత్వ వికాసానికి దోహదం

పిల్లలకు ప్రతిరోజూ ఒక మంచి కథను చెప్పడం వల్ల వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కథలు చెప్పేటప్పుడు పిల్లల ధ్యాస పూర్తిగా కథపైనే ఉంటుంది. కాబట్టి, వారి ఏకాగ్రత పెరుగుతుంది. ఆసక్తి కూడా పెరుగుతుంది. ఇదే ఆసక్తి తరువాత చదువుపైనా పెరిగేందుకు కథలు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, పదేళ్లలోపు మాత్రమే కథలు వినడానికి ఆసక్తి చూపిస్తారని ... మిగతా 6వ పేజీలో



భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

- వికసిత భారత్, స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

అనకాపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ సూచించారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో శనివారం కేంద్ర ప్రయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా పని చేయాలన్నారు. భవిష్యత్తులో అనకాపల్లి జిల్లా 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో ఇప్పుడున్న సవాళ్లను అధిగమించి విజయవంతంగా వికసిత అనకాపల్లి జిల్లాగా రూపొందించడమే అందరి లక్ష్యం కావాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనిదినాల కల్పన, మెటీరియల్ కాంపోనెంట్‌లో లక్ష్యాన్ని మించి పనిచేసినందుకు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. సమీక్షలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కంపోనెంట్, 2019-24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుతం పథకం అమలుపై వివరాలు తెలుసుకున్నారు. జల్‌జీవన్ పథకం పనులు వేగవంతం చేయాలన్నారు. పలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు పర్యాటకరంగ అభివృద్ధిపై చర్చించారు. తాటిబెల్లం, ఆర్గానిక్ బెల్లం ఉత్పత్తికి అనకాపల్లి బ్రాండ్ ఇమేజ్ కల్పన దిశగా కార్యాచరణ, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.



లంకా దినకర్‌తో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్, కార్పొరేషన్ చైర్మన్లు

ప్రజలకు అవగాహన కల్పించాలి

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీ పనులు చేసే ముందు గతంలో చేసిన పనులనే మళ్లీ చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చెరువుల తవ్వడంతో పాటు కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో 80 శాతం సిమెంట్ రోడ్డు పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం రోడ్డు పనులు పూర్తి చేశాక పంట కాలువల పనులు చేపట్టాలని సూచించారు. జల్‌జీవన్ పథకం పనులు చేపట్టేందుకు రోడ్లు తవ్వేస్తున్నారని, తవ్విన రోడ్ల పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఈ సమావేశానికి ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ... మిగతా 6వ పేజీలో

బదిలీల కోసం 123 మంది హెచ్‌ఎంల దరఖాస్తు

విశాఖపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో బదిలీలకు 123 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో జడ్పీ హెచ్‌ఎంలు 102 మంది, మునిసిపల్ పాఠశాలల హెచ్‌ఎంలు 17 మంది, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు నలుగురు ఉన్నారు. వీరికి సంబంధించి బదిలీల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా ప్రాంతీయ విద్యా శాఖ, విశాఖ జిల్లా విద్యా శాఖ వెబ్‌సైట్స్‌లో పొందుపరిచారు. బదిలీలకు దరఖాస్తు చేసిన హెచ్‌ఎంలు వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తులో పేర్కొన్న వివరాలు సరిచూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే ఆదివారం సాయంత్రంలోగా తెలపాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు దరఖాస్తు గడువు పెంపు

స్కూలు అసిస్టెంట్ల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఆదివారం ఉదయం 11.45 గంటల వరకు పెంచామని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రి 12 గంటలతో గడువు ముగుస్తుందన్నారు. అయితే ఆదివారం ఉదయం 11.45 గంటల వరకూ గడువు పెంచినట్టు తెలిపారు.

సీఐడీకి అచ్యుతాపురం సైబర్ క్రైమ్ కేసు?

- నాలుగు రోజుల క్రితం 33 మంది అరెస్టు

అనకాపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నాలుగు రోజుల క్రితం వెలుగుచూసిన సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కేసును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి సైబర్ నేరగాళ్ల సమాచారం ఇవ్వడంతో పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలోని భోగాపురం వద్ద గల పవన్ రెసిడెన్సీపై దాడులు నిర్వహించారు. పదుల సంఖ్యలో యువతీ, యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో అసోం, నాగాలాండ్, మేఘాలయ, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో యువతీ, యువకులను రిక్రూట్ చేసుకుని, ఇక్కడకు తీసుకొచ్చి వారికి ట్రైనింగ్ ఇచ్చి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్టు ప్రాథమికంగా తేల్చారు. గత రెండేళ్ల నుంచి ఈ వ్యవహారం సాగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. అమెరికాతో పాటు మరికొన్ని దేశాల్లో అమెజాన్ కస్టమర్లను లక్ష్యంగా చేసుకుని నెలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ దోచుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో 33 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముంబై, రాజస్థాన్‌కు చెందిన పునీత్ గోస్వామి, అవిహంత్ దాగా కీలక సూత్రధారులుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ (ఎన్‌టీఆర్‌ఓ), కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇండియా) వంటి సంస్థల సహకారంతో కేసును సీఐడీ దర్యాప్తు చేయనున్నట్టు సమాచారం. అయితే విచారణను సీఐడీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



అచ్యుతాపురంలో సైబర్ నేరగాళ్లు కార్యకలాపాలు నిర్వహించిన అపార్టుమెంట్ ఇదే (ఫైల్ ఫొటో)

మహిళలపై ఆగని దాడులు

» అతివల్లో ఆత్మస్థైర్యం పెంపు లక్ష్యంగా శిక్షణ తరగతులు

» ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి వెల్లడి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

మునగపాక, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా మహిళలపై దాడులు మాత్రం ఆగడం లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు ప్రభావతి ఆరోపించారు. మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో ఉన్న డావిన్సీ స్కూల్‌లో శనివారం రాష్ట్ర యువ మహిళల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి ఎవరొచ్చినా జరిగిన సంఘటనలపై నాయకుల్లో తప్పించుకునే ధోరణి కనిపిస్తోందని చెప్పారు. శిక్షణ తరగతుల ప్రిన్సిపాల్ వై.సత్యవతి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పాత్రపై తొలిరోజు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ ఆది నుంచి స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసం కొనసాగుతూనే ఉందన్నారు. ఆస్తిలో సమాన హక్కు ఉన్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదన్నారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర నలు మూలల నుంచి యువ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'కూలీలు పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలి'



కూలీలకు మజ్జిగ అందిస్తున్న టీడీపీ నాయకుడు దిన్‌బాబు

రాంబిల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో శనివారం చలివేంద్ర ఏర్పాటైంది. టీటీడీ, జనసేన మండల నేతలు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర ప్రారంభించారు. తొలుత ఉపాధి కూలీలకు మజ్జిగను అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీలు పని ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ సీరా వెంకటరావు, ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాస్, నాయకులు సీరా నానాజీ, సారిపల్లి నూకరాజు పాల్గొన్నారు.

'రేషన్ సరఫరా వాహనాలను నిలుపుదల చేయొద్దు'

మునగపాక, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న వాహనాల సేవలను నిలుపుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. ఉమ్మలాడ గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ తాజా నిర్ణయంతో డిపోలకు వెళ్లి సరకులు తీసుకోవడం ప్రజలకు ఇబ్బందికరమని చెప్పారు. ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, పిల్లి అప్పారావు, బొడ్డేడ లిల్లీ, మొల్లేటి వినోద్, నారాయణ, బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు

ఏయూ డిగ్రీ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థినుల ప్రతిభ



2వ ర్యాంక్ సాధించిన మాకిరెడ్డి జయంతి



బీబీఏ విభాగంలో ర్యాంకర్లు షరా, నవాజ్, కాశీ అన్నపూర్ణ

పాయకరావుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం 2022-25 డిగ్రీ బ్యాచ్ ఫలితాల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని మాకిరెడ్డి జయంతి ప్రతిభ కనబరిచి వర్సిటీ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి ఈమేరకు వివరాలు అందజేశారు. ఏయూ ప్రకటించిన డిగ్రీ ఫైనల్ ఇయర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థిని మాకిరెడ్డి జయంతి బీఎస్సీ విభాగంలో ఏయూ స్థాయిలో రెండవ ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు సాధించిందన్నారు. బీబీఏ విభాగంలో నక్కా షారా జిల్లాలో రెండవ ర్యాంకు, సయ్యద్ గుల్ఫిషాన్ నవాజ్, మద్దూరి కాశీఅన్నపూర్ణ జిల్లాలో మూడవ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. ఈ విద్యార్థినులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తోపాటు పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులకు సత్కారం



నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని సన్మానిస్తున్న నాయకులు

పాయకరావుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నియమితులైన టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబులను శనివారం పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కంకి పాటి వెంకటేశ్వరరావు, నాయకులు చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకట రమణ, గణపర్తి దొరబాబు, గారా కృష్ణప్రసాద్, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో సీలేరు యువకుడి మృతి



ఆశిక్ (ఫైల్‌ఫొటో)

సీలేరు/ పాయకరావుపేట మే 24 (ఆంధ్ర జ్యోతి): రైలు ప్రమాదంలో సీలేరుకు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా గుల్లిపాడు వద్ద జరిగింది. దీంతో సీలేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి జిల్లా జీకేవీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన షేక్‌అలీ మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలీ కుమారుడు షేక్ ఆశిక్ విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తిచేసి ద్వితీయ సంవత్సరంలో చేరాడు. శనివారం తుని సమీపంలో గుల్లిపాడు వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఆశిక్ మృతి చెందాడు. ఈ విషయమై తండ్రి అలీకి ఫోన్ రావడంతో తన కుమారుడు తుని ఎందుకు వెళ్లాడో.. ఏమి జరిగిందోనని రోదిస్తూ తెలిపాడు. శుక్రవారం కుమారుడు ఫోన్ చేసి కాలేజీ ఫీజు చెల్లించాలని అడిగాడని వెంటనే డబ్బులు పంపించానని అలీ తెలిపాడు. ఆశిక్ తుని ఎందుకు వెళ్లాడో తెలియదంటూ భోరున విలపించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చెత్తరహిత జిల్లా అందరి లక్ష్యం కావాలి

» కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపు » 'మెగా క్లీనింగ్ డ్రైవ్'లో భాగంగా ఎమ్మెల్యే 'సుందరపు'తో కలిసి ప్రతిజ్ఞ, తుప్పల తొలగింపు



నాగవరంలో అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఉద్యోగులు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏపీఐఐసీ కార్యాలయం వద్ద శనివారం మెగా క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై పరిసరాల పరిశుభ్రతకు అందరూ పాటుపడాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. చెత్తరహిత జిల్లా స్థాపనే అందరి లక్ష్యం కావాలన్నారు. అనంతరం అచ్యుతాపురం ప్రధాన కూడలి వద్ద పారిశుధ్యంపై అవగాహన కల్పించి, వ్యర్థాలను తొలగించారు. జంక్షన్ సమీపంలో గల మోసయ్యపేట చేపల మార్కెట్‌ను కలెక్టర్ సందర్శించి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్య లపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో లారస్ కంపెనీకి చెందిన 200 ఉద్యోగులు, యాజమాన్యం సభ్యులు, కూటమి నాయకులు పాల్గొని పారిశుధ్య పనులు చేపట్టారు.

మునగపాకలో...

మునగపాక : మండలంలోని నాగవరంలో మెగా క్లీనింగ్ డ్రైవ్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ విజయకృషన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండవచ్చునన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్త తొలగింపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే తుప్పలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి : మెగా క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విజయకుమార్ ఆదేశాల మేరకు ఎలమంచిలి శివారు కోటారు శ్రీను పెట్రోల్ బంక్ నుంచి నారాపురం వరకు పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రోడ్డు పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తరలించారు. అనంతరం పిచ్చి మొక్కల తొలగింపును చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉటకోటి రమేష్, కొటారి శ్రీనివాస్, గుర్రాల శేఖర్, కర్రి ఝాన్సీ, జయరాం, కె.సతీష్, లంక రాజు, ఉదయ్‌కుమార్, ఎం.సంతోష్ కుమార్, వీరమహిళలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచదార్ల గ్రామంలో...

రాంబిల్లి : మండలంలోని పంచదార్ల గ్రామంలో శనివారం పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్, టీడీపీ మండల నాయకుడు వి.దిన్‌బాబు తనసొంత నిధులతో పంచాయతీ పరిధిలో ఉన్న జాతీయ రహదారిలో ఏపుగా పెరిగిన కంచి చెట్లు, తుప్పలను జేసీబీ ద్వారా తొలగించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మరాజు, అప్పారావులతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు 5,332 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

» సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

» ఏడీఏ ఉమాప్రసాద్



ఏడీఏ ఉమాప్రసాద్

పాయకరావుపేట, మే 24 (ఆంధ్ర జ్యోతి): పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 5,332 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేస్తున్నట్టు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె. ఉమా ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన అం దించిన వివరాలివి.. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండే అవకాశమున్నందున డివిజన్ పరిధిలో వరి సాధారణ విస్తీర్ణం 39,404 ఎకరాల్లో పంట సాగవుతుందని అంచనా వేశామన్నారు. వీటిలో పాయకరావుపేట మండలంలో 6,912 ఎకరాలు, నక్కపల్లిలో 4,400 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశముందన్నారు. అదేవిధంగా కోటవురట్లలో 4,135, మాకవరపాలెంలో 8,502, నాతవరం మండలంలో 15,455 ఎకరాల్లో సాగవుతుందన్నారు. డివిజన్ పరిధిలో ఈ ఏడాది చెరకు సాధారణ విస్తీర్ణం 1,050 ఎకరాలు, పత్తి 247 ఎకరాలు, నువ్వులు 1292, వేరుశనగ 30 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ఖరీఫ్‌లో 5,332 క్వింటాల్ల వరి విత్తనాల కోసం ఇండెంట్ ప్రభుత్వానికి అందజే శామన్నారు. వీటిలో శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్ 2537, సాంబమసూరి బీపీటీ 5204, ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీ యూ 1064(అమర), ఎంటీయూ 1121(శ్రీ ధృతి), ఎంటీయూ 1224 (మారుతేరు సాంబ), ఎంటీయూ 1262 (మారుతేరు మసూరి), ఎంటీయూ 1318 (తరంగిణి) రకం విత్తనాలు ఉన్నాయన్నారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో 230 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. ఐదు గ్రామాలను శత శాతం ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు. డివిజన్‌లోని మిగిలిన అన్ని గ్రామాల్లోను కనీసం 35 మంది చొప్పున రైతులు ప్రకృతి సాగుచేసేలా ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు.



గుంటపల్లిలో పదేళ్లుగా అసంపూర్తి అంగన్‌వాడీ భవనం(ఫైల్ ఫొటో)



నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైన దృశ్యం

అంగన్‌వాడీ భవనానికి మోక్షం

» నిధులు చాలక దశాబ్దకాలంగా నిరుపయోగం

» కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు

పాయకరావుపేట రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా గుంటపల్లిలో అసంపూర్తిగా నిలిచి పోయిన అంగన్‌వాడీ భవనానికి ఎట్టకేలకు ప్రస్తుతం ప్రభుత్వంలో మోక్షం కలిగింది. గ్రామంలో పదేళ్ల కిందట ఎంపీటీసీ నిధులు సుమారు రూ. 5 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మాణం ప్రారంభించారు. అయితే భవనం పూర్తయినా, నిధులు చాలక ప్లాస్టింగ్‌లు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. తరువాత ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితంలేకపోయింది.

దీంతో ఈ పదేళ్లలో నిరుపయోగంగా వదిలేశారు. జిల్లా అధికారులు గ్రామానికి విచ్చేసినప్పుడు వారికి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పల్లి దుర్గ ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి చొరవతో రాష్ట్ర హోం మంత్రి అనిత మండల పరిషత్ నిధులు సుమారు రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ప్లాస్టింగ్‌లు పూర్తి చేసుకుని పెయింట్‌లు వేస్తున్నారు. ఇన్నాళ్లకు అంగన్‌వాడీ కేంద్రానికి మోక్షం లభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ సరకులు సక్రమంగా సరఫరా చేయాలి



టీడీపీ మండల అధ్యక్షుడు లింగం నాయుడుకి శుభాకాంక్షలు తెలుపుతున్న డీలర్లు

కోటవురట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకులు వినియోగదారులకు సక్రమంగా సరఫరాచేసి ప్రభుత్వాన్ని మంచి పేరు తీసుకురావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు డీలర్లకు సూచించారు. శనివారం జల్లూరులో మండలంలోని రేషన్ డీలర్లు నూతనంగా పార్టీ అధ్యక్షులుగా నియమితులైన లింగం నాయు డు కలిసి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇసుక దందాకు అడ్డేలేదు

... 5వ పేజీ తరువాయి

అధికారులు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది.

ఒక రోజు బ్రేక్.. మళ్లీ యథావిధిగా తవ్వకాలు

శేమునాపల్లిలో సాగుతున్న ఇసుక దందాను పరిశీలించేందుకు శుక్రవారం జనసేన నాయకులు వస్తున్నారని సమాచారం తెలియడంతో వాహనాలు అక్కడ నుంచి పంపించేసి, ఇసుక దందాకు ఒక రోజు విరామం ఇచ్చారు. తిరిగి శనివారం ఉదయం నుంచి యథావిధిగా కొనసాగిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా అడ్డగోలుగా సాగుతున్న ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళతా..

శేమునాపల్లి, గవరవరం, లక్కవరం తదితర ప్రాంతాల్లో సాగుతున్న ఇసుక దోపిడీపై సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు జనసేన ఇంచార్జిపీవీఎస్ఎన్ రాజు తెలిపారు. శేమునాపల్లిలో ఇసుక దోపిడీ ఏమాత్రం ఆగకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరై కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై నివేదికలు సమర్పించారు.

వికసిత అనకాపల్లి జిల్లాగా అభివృద్ధి

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల పనులను మరింత వేగవంతం చేసి వికసిత అనకాపల్లి లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించామని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ కింద 120 లక్షల పని దినాలు బడ్జెట్ అయితే 124.67 లక్షల పని దినాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులకు సూచించినట్టు ఆయన చెప్పారు.

అనగనగా...

... 5వ పేజీ తరువాయి

, ఆలోగానే పిల్లలకు తల్లిదండ్రులు ఆ అలవాటు చేయడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. కథల వల్ల పిల్లల్లో ఊహాశక్తి కూడా మెరుగవుతుంది.

ఓపిక పెరిగే అవకాశం

ప్రస్తుతం పిల్లల్లో ఎవరైనా చెబితే వినే ఓపిక ఉండడం లేదు. కథలు చెప్పడం వల్ల చిన్నతనం నుంచి వినే ఓపిక పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ కథలను వినిపించే అలవాటు వల్ల పిల్లలు ఎవరైనా ఏదైనా చెబితే వినేందుకు ఆసక్తి చూపిస్తారు. పూర్తిగా విన్న తరువాతవాటిపై స్పందించే గుణం కూడా అలవడుతుందని పేర్కొంటున్నారు. వినడం, తరు వాత స్పందించడం అన్నది ఏ వయసులో వారికి అయినా అత్యంత కీలకం. అవతలి వ్యక్తి చెప్పేది పూర్తిగా వినకుండా స్పందించడం అన్నది అనేక అనర్థాలకు దారితీస్తుంది. కథలు చెప్పడం ద్వారా వినే ఓపికను పెంచేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అనేక సంస్థలు..

స్టోరీ టెల్లింగ్‌ను హాబీగా మార్చుకుంటున్న యువత కూడా ఉన్నారు. ప్రస్తుతం వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్టోరీ టెల్లింగ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నారు. అనేక స్కూల్స్ కూడా స్టోరీ టెల్లర్స్‌ను రిక్రూట్ చేసుకుంటున్నాయి. అయితే బయట ఇతరులు చెప్పే స్టోరీల కంటే తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చెప్పే స్టోరీలు పిల్లల మనసుకు హత్తుకుంటాయి. రాత్రి పడుకునే సమయంలో పిల్లలకు ఈ కథలను చెప్పడం వల్ల వారితో అనుబంధం మరింత పెరుగుతుంది. పిల్లలు కూడా ఏదైనా ఇబ్బంది ఉంటే తల్లిదండ్రులతో చెప్పుకునేందుకు ఈ సమయం ఉపయోగపడుతుంది.

మంచి నిద్రకు అవకాశం

రాత్రివేళల్లో పిల్లలు పడుకునే సమయంలో ఈ కథలను చెప్పడం వల్ల మంచి ఆరోగ్యకరమైన నిద్రను పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎంతోమంది పిల్లలు స్మార్ట్ ఫోన్ చూస్తూ, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లతో అర్ధరాత్రి వరకూ ఉంటున్నారు. దీనివల్ల వారికి నిద్ర కరవవుతోంది. ఈ తరహా సమస్యలకు కథ మంచి పరిష్కారంగా నిపుణులు చెబుతున్నారు. పిల్లలను పక్కలో వేసుకుని మీరు చెప్పే కథలు వారిని మంచి నిద్రకు ఉపక్రమించేలా చేస్తాయని పేర్కొంటున్నారు.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా..

ఒకసారి పిల్లలను కథలకు అలవాటు చేస్తే ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అడిగేందుకు కూడా ఆసక్తి చూపించరు. పిల్లలకు చెప్పేందుకు అనుగుణమైన కథలను ప్రతిరోజూ ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ కథలు చెప్పడం రాకపోయినా యూట్యూబ్‌లో అనేక చానెల్స్ ప్రత్యేకంగా కథలను అందిస్తున్నాయి. కొన్ని బుక్స్ కూడా ఉన్నాయి. వీటిని విని లేదా చదివి పిల్లలకు చెప్పవచ్చు. ఒకవేళ చెప్పేంత తీరిక లేకపోతే పిల్లలను పక్కలో వేసుకుని ఆడియో స్పీకర్ ద్వారా వినిపించవచ్చు. అయితే, ఆ కథ వినే క్రమంలో పిల్లలకు వాటి గురించి విశ్లేషించి చెప్పడం అవసరం అని నిపుణులు చెబుతున్నారు.

ఈ సమస్యలకు పరిష్కారం

ప్రస్తుతం ఎంతోమంది పిల్లలు చిన్న వయసు నుంచే హైపర్‌గా రియాక్ట్ కావడం, ఒత్తిడికి గురికావడం, చిరాకు, కోపం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు, గురువులు చెప్పే మాట కూడా వినేందుకు ఆసక్తి చూపించరు. వద్దని వారించినా వినిపించుకోని స్థితిలో ఉన్నారు. కొందరు చిన్నారులు తినేందుకు కూడా ఆసక్తి చూపించరు. ఈ తరహా సమస్యలకు కథలు వినడం పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ఏడాది వయసు నుంచే పిల్లలకు కథలను చెప్పడం అలవాటు చేయాలి.

నైపుణ్యాలను మెరుగుపరచడంలో దోహదం

- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక నిపుణులు

కథలు అనేవి చిన్నారుల్లో అనేక నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఉపయోగపడతాయి. కథలు చదవడం వల్ల పిల్లలకు మేలు కలుగుతుంది. పిల్లల్లో ఆలోచనాత్మక, విశ్లేషణాత్మక శక్తి పెరగడంతోపాటు కొత్త విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది. కొన్ని కథల్లో ఉండే నీతి వారి జీవితాలపై ప్రభావాన్ని చూపిస్తుంది. పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంచడంలో కీలకంగా ఉంటాయి. అలాగే, మాట్లాడే తీరులో మార్పు వస్తుంది. వినే శక్తి, మంచి, చెడులను గుర్తించే సామర్థ్యం కథలతో పెరుగుతుంది. కథలు పట్ల ఆసక్తి పెరిగే చిన్నారులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంటారు. ఇది అనేక అనర్థాల నుంచి చిన్నారులను రక్షిస్తుంది. కాబట్టి, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు ప్రతిరోజూ ఏదో ఒక కథను చెప్పాలి. ఇది వారి జీవితాన్ని మెరుగ్గా మలచేందుకు దోహదం చేస్తుంది.

'విద్యతో ఉజ్వల భవిష్యత్తు'

మునగపాక, మే 24 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అప్పారావు అన్నారు. తిమ్మరాజుపేట సత్యసాయి మందిరంలో తోసా ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై శనివారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సమష్టి కృషితో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ముమ్మందు మరిన్ని మెరుగైన ఫలితాల సాధనకు తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యపట్ల మరింత ప్రోత్సహించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటింటికి రేషన్ పంపిణీదారుల ఆందోళన



తహసీల్దార్ తిరుమలబాబుకి వినతపత్రమిస్తున్న ఆపరేటర్లు

కోటవురట్ల, మే 24(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఇంటింటికి రేషన్‌పంపిణీ వాహనాల రద్దు నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎండీయూ ఆపరేటర్లు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైసీపీనాయకులు డీవీ సూర్యనారాయణరాజు, పైల రమేష్, కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఈసందర్భంగా కోరారు. ఆరునెలలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తమతో ఆరేళ్లు ఒప్పందం చేసుకుందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దుచేస్తున్నట్టు ప్రకటించడం అన్యాయమన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుమలబాబుకి వినత పత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు, రేవుపోలవరం, చిన ఉప్పలం, పెద్ద ఉప్పలం, వాతాడ బంగారమ్మపాలెం గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంపద కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

నక్కపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో డీ సీతారామరాజు తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సూచించారు. ఇంటింటా తడి,పొడి చెత్త ఏరివేతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. జూన్ 21న విశాఖ కేంద్రంగా జరగున్న అంతర్జాతీయ యోగా డేను విజయవంతానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో యోగా శిక్షణ ఉంటుందని చెప్పారు. ప్రతీ ఒక్కరూ యోగాంధ్ర యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈవోఆర్‌డీ శ్రీను, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో పేదలకు మేలు

»'సూర్యఘర్' యోజనపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కొణతాల



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్

కశింకోట, మే 24 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు పేదలపై విద్యుత్ భారం తగ్గుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బయ్యవరంలో శనివారం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఇళ్లకు సోలార్ విద్యుత్ రూఫ్ టాప్ ఏర్పాటుకు మహిళలే నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం 50శాతం సబ్సిడీతోనే సోలార్ విద్యుత్ అందజేస్తున్నాయన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 10వేల గృహాలకు సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద బయ్యవరంలో శతశాతం సోలార్ విద్యుద్దీకరణ లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. అనంతరం సోలార్ విద్యుత్ రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి.రవికుమార్, కూటమి నాయకులు ఎస్.కె.బాబర్, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి గంగయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

» జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ లావణ్య వెల్లడి » 100 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ





యోగాసనాలు వేస్తున్న దృశ్యం.., శిక్షణలో పాల్గొన్న మాస్టర్ ట్రైనీలు

అనకాపల్లి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా ఆయుష్ శాఖ అధికారిణి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో 25 మంది యోగా గురువులతో 100 మంది మాస్టర్ ట్రైనీలకు యోగా ప్రొటోకాల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో వివిధ యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిపారు. యోగా మన ప్రాచీన సంస్కృతి అని అన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని, ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారిణి కె.మనోరమ, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి కేవీ జ్యోతి, ఆయూష్ విభాగం, వైద్యాధికారులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

మనిషి జీవితంలో యోగా భాగం కావాలి

సబ్బవరం : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా సం పూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 21 వరకూ యోగా విద్యపై అవగాహన సదస్సుల్లో భాగంగా శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి మనిషి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగా వలన మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులు సరైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని వివరించారు. అనంతరం జాతీయ యోగా పోటీల విజేత పండూరి జయలక్ష్మి యోగాసనాలపై అవగా హన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ ఎం.రత్నప్రకాశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సుల్లో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

'ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలకు తీవ్ర నష్టం'

తుమ్మపాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అనాదిగా అడవులనే నమ్ముకొని ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆపరేషన్ కగార్‌పై జూన్ రెండో తేదీన నిర్వహించనున్న జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు వియ్యపు రాజు, శంకర్రావు, పోతురాజు, సూరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న టీచర్లకు న్యాయం చేయాలి

కొత్తూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2023లో జరిగిన బదిలీల్లో వీరంతా ఊహించని విధంగా ఎటువంటి సదుపాయాలు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయ్యారని తెలిపారు. ఇందులో 50ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన మహిళలు, భార్యాభర్తల ఉద్యోగుల్లో ఒకరు ఉన్నారని వివరించారు. అంతేకాకుండా అనారోగ్యాల బారిన పడిన వారు కూడా ఉన్నారని, వీరికి న్యాయం చేస్తామని ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి పలు పర్యాయాలు హామీ ఇచ్చిన నేపథ్యంలో న్యాయం చేయాలని విన్నవించారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

» అనకాపల్లి క్రీడాకారుడికి బంగారు పతకం



బంగారు పతకం అందుకున్న చరణ్ (మధ్యలో)

అనకాపల్లి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర కొల్లాపూర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారుడు ఎస్.బాలసాయిచరణ్ జాతీయస్థాయి రికార్డు నెలకొల్పడమే కాకుండా బంగారు పతకం సాధించాడని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.బద్రీనాథ్ తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీ ల్లో 83 కిలోల విభాగంలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన చరణ్ స్క్వాడ్ ఈవెంట్‌లో 252 కిలోల బరువును ఎత్తి జాతీయస్థాయి రికార్డు దక్కించుకున్నాడన్నారు. బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో 665 కిలోల బరువును ఎత్తి ఓవరాల్‌గా బంగారు పతకం సాధించాడన్నాడు. చరణ్ విజయం పట్ల నీలా, అజయ్, క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో పొల్యూషన్ సర్టిఫికెట్

» ఆటోల్లో ఆరుగురు విద్యార్థులను మాత్రమే ఎక్కించుకోవాలి
» స్కూల్ ఆటోలకు గుర్తింపు ఇచ్చే విధంగా చర్యలు
» ఆటో డ్రైవర్ల సమావేశంలో జిల్లా రవాణా అధికారి మనోహర్



ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీటీవో మనోహర్

అనకాపల్లి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు పొల్యూషన్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారానే పొందాలని జిల్లా రవాణా అధికారి మనోహర్ సూచించారు. ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. గతంలో మాదిరిగా పొల్యూషన్ సర్టిఫికెట్ ఆఫ్‌లైన్‌లో తీసుకుంటే చెల్లదని స్పష్టం చేశారు. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యార్థులను డ్రైవర్లు ఆటోల్లో ఎక్కించుకొని విద్యా సంస్థలకు చేరవేయాలన్నారు. స్కూల్ యాజమాన్యం, రవాణా శాఖ, తల్లిదండ్రులు, పోలీసులతో కమిటీని వేసి, స్కూల్ ఆటోలకు ఒక గుర్తింపు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆటో డ్రైవర్లు కూడా కేవలం ఆరుగురు విద్యార్థులను మాత్రమే ఆటోల్లో ఎక్కించుకోవాలని స్పష్టం చేశారు. మోటార్ వాహన చట్టం నిబంధనలను విధిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానాతో పాటు ఆటోను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెండోసారి పట్టుబడితే జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అనకాపల్లి పట్టణంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని నెహ్రూచౌక్‌లోకి ఆటోలు రాకుండా డ్రైవర్లు సహకరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు. ఈ సందర్భంగా పలువు ఆటో డ్రైవర్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు గోపీకృష్ణ, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	513
విజయనగరం	517
శ్రీకాకుళం	517

యాబై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పరవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలను యాభై శాతం రాయితీపై రైతులకు అందజేసేందుకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి తెలిపారు. జనుము పది క్వింటాళ్లు, జీలుగ 16.5 క్వింటాళ్లు, పిల్లి పెసర 2.6 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులంతా ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం వెంట తీసుకు వెళ్లి పొందవచ్చునన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ విజయ్‌కుమార్

సీఐలకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రశంస



ప్రశంస అందుకుంటున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో చక్కని ప్రతిభ చూపినందుకు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణలను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా ఇద్దరు సీఐలకు ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. పలువురు అధికారులు వీరిని అభినందించారు.

'డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ హర్షణీయం'



సమావేశానికి హాజరైన రేషన్ డీలర్లు

అనకాపల్లి టౌన్/కొత్తూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకులను డీలర్ల ద్వారానే నేరుగా వినియోగదారులకు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఇక్కడ రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో పలువురు మాట్లాడారు. 2021 వరకు సాఫీగా సాగుతున్న డీలర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం కార్యకర్తలకు ఉపాధి కల్పించాలనే దురుద్దేశంతో నీరుగార్చిందని వాపోయారు. రాష్ట్రంలో ఎండీయూ వ్యవస్థ ద్వారా రేషన్ మాఫియా బాగా పెరిగిందని గమనించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శాసనసభలో డీలర్ల వ్యవస్థే బాగుందని చెప్పడం అభినందనీయమన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం జూన్ ఒకటి నుంచి రేషన్ డిపోల ద్వారా ప్రజలకు సరకులు అందజేయాలని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కడిమిశెట్టి గాంధీ, దాడి రమణ, దయాల్‌రాజు, పెంటకోట నాయుడు, కొణతాల బుజ్జి, కరణం శ్రీను, చింతల సత్తిబాబు, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆలోచింపజేసిన నాటిక పోటీలు

కశింకోట, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపేట వీధిలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు మూడో రోజు కు చేరుకున్నాయి. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో శనివారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శించారు. ఈ పోటీలను జిల్లా తెలుగురైతు అధికార ప్రతినిధి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ నాయకులు వేగి గోపి, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్, పెంటకోట రాము ప్రారంభించారు. ముందుగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారు 'మూల్యం' నాటికను, తరువాత కొలకలూరు సాయి ఆర్ట్స్ వారు 'జనరల్ బోగీలు' నాటికను, అనంతరం విశాఖపట్నం పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ బృందం 'శిథిల జీవి' నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. పాత్రదారులు తమ నటనతో అందరినీ మెప్పించి ప్రశంసలు అందుకున్నారు.



శిథిలజీవి నాటికలో ఓ సన్నివేశం

45 ఏళ్లు దాటిన పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

విశాఖపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు 45 సంవత్సరాలు పైబడి ఉన్న సుమారు 750 మంది అనకాపల్లి జిల్లాకు చెందిన పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం కొత్త వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో జరిగిన ఈ ఉచిత ఆరోగ్య పరీక్షల్లో 45 ఏళ్లు దాటిన పోలీసు సిబ్బంది అందరూ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పని భారంతో శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతున్న సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ ఆస్పతిలో 13 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో గుండె, కిడ్నీ, మహిళలకు మమోగ్రఫీ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు ఉన్నాయి. అచ్యుతాపురానికి చెందిన రుషిల్ డెకర్స్ లిమిటెడ్ సహకారంతో ఈ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేపట్టారు. ప్రతి రోజు 50 మంది చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి రోజు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైద్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుల శ్రేయస్సు కోసం ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత అవసర మన్నారు. అనకాపల్లి ఎస్పీని, రుషిల్ డెకర్ లిమిటెడ్ ప్రతినిధులు, మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో రుషిల్ డెకర్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు ఏకే రాయ్, మెడికవర్ ఆస్పత్రి సెంట్రల్ హెడ్ డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్, అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వాట్సా్ప్‌లో రైస్‌కార్డు సేవలు

» కార్డులో మార్పుచేర్పులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు
» కొత్త కార్డు కోసం ఆప్షన్ లేకపోవడంపై అసంతృప్తి

అమరావతి, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైస్ కార్డులో మార్పుచేర్పులు, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకునేందుకు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలు శనివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో ఎనిమిది రకాల సేవలు ఉన్నప్పటికీ, ప్రధానంగా కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇలా దరఖాస్తు చేయాలి...

మొబైల్ ఫోనులో 'మనమిత్ర' వాట్సాప్ చాట్‌లోకి వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే 'సేవను ఎంచుకోండి' అని వస్తుంది. దానిని క్లిక్ చేస్తే 'పౌర సేవను ఎంచుకోండి' అనే బాక్స్‌లో 'సివిల్ సప్లయిస్ సేవలు'పై క్లిక్ చేయాలి. 'దీపం' స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ, రైస్ కార్డులో సభ్యులను జోడించడం, రైస్ కార్డులో సభ్యులను తొలగించడం, తప్పుగా జోడించిన ఆధార్ సీడింగ్ సవరణ, రేషన్ కార్డ్ విభజన దరఖాస్తు.. అనే 8 రకాల సేవలు కనిపిస్తాయి. వీటిలో మీకు అవసరమైన సేవను ఎంపిక చేసుకుని.. వివరాలను పూరించడం ద్వారా వాట్సాప్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు.

జాప్యాన్ని నివారించడానికే...

కొత్త రైస్ కార్డులతో పాటు ఇతర సేవల కోసం ఈ నెల 7నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చి పడుతుండటంతో ఒత్తిడి పెరిగి సర్వర్లు డౌన్ అయిపోవడం, ఇతర సాంకేతిక సమస్యలతో వాటిని ఆన్‌లైన్ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో రైస్ కార్డు దరఖాస్తులు సమర్పించడానికి వీలుగా 'మనమిత్ర' (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను ఈ నెల 15 నుంచే అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాంకేతికపరమైన కారణాలతో ఈసేవలను ప్రకటించిన సమయా నికి అందుబాటులోకి తీసుకురాలేకపో యారు. ఎట్టకేలకు శనివారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దరఖాస్తుదారులకు కొంత వెసులుబాటు కల్పించారు. అయితే ఇందులో కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో ఇలాంటి వారంతా తప్పనిసరిగా సచివాలయాలకు వెళ్లాల్సిందే.


సుబ్బారావుకు స్వీట్స్ తినిపిస్తున్న నాయకులు, కార్యకర్తలు


ముంచంగిపుట్టుస్త్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు సన్యాసమ్మ అభినందిస్తున్న నేతలు

గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతమే లక్ష్యం

అనంతగిరి మండల నూతన అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు

అనంతగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావును ప్రకటించడంపై మండల కేంద్రంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం బాణ సంచాలు కాల్చి, స్వీట్స్ తినిపించుకుంటూ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సోవేరి సుబ్బారావు మాట్లాడుతూ.. పార్టీకోసం కష్టపడేవారిని అధిస్టానం గుర్తిస్తుందనడానికి తానే నిదర్శనమని చెప్పారు.. ఎంతో విశ్వాసంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన అరకు ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని చెప్పా రు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ అప్పారావు, నాయకులు చిట్టిబాబు, శంకరరావు, బాబీ, భీమన్న, ఈశ్వరరావు, జగన్‌బాబు, రంజిత్ పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుతా.:

ముంచంగిపుట్టు మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ

ముంచంగిపుట్టు: తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కిల్లో సన్యాసమ్మను ఎంపిక చేయడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. శనివారం ఆమెను మండల నాయకులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సన్యాసమ్మ మాట్లాడుతూ మండల అధ్యక్ష పదవిని ఇచ్చిన అధిష్ఠానం నమ్మకాన్ని వమ్ముచేయకుండా పని చేస్తానని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ జెండా మండలంలో రెపరెపలాడేలా అందరికీ కలుపుకుంటూ ముందుకు వెళ్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, పార్టీ మాజీ అధ్యక్షులు కె.బలరాం, వి.రామస్వామి, నేతలు ఎస్.బాబూజీ, ఎన్.శంకరరావు, వి.జగదీశ్, ఆర్.కొండలరావు, కె.కామరాజు, ఎం.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో...

పెదబయలు: తమపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తామని తెలుగుదేశం పార్టీ నూతన మండల అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య వెల్లడించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడా


కార్యకర్తలతో మాట్లాడుతున్న పెదబయలు అధ్యక్షుడు కొండయ్య

రు. అరకు ఇన్‌చార్జి దొన్నుదొర, అరకు పార్లమెంట్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్‌ల ఆశీస్సులతో తనకు సముచిత న్యాయం జరిగిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. కొత్త కమిటీతో పార్టీ బలోపేతానికి మరింత ఉత్సహంగా పని చేస్తామని అన్నారు. మండలంలోని 23 పంచాయతీల కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి గిరిజనులకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఉల్లి సింహచలం, ప్రధాన కార్యదర్శి కొర్రా రాజరావు, వినోద్, బాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల భాగ్యస్వామ్యంతో ముందుకు..

డుంబ్రిగుడ : ప్రజల భాగస్వామ్యంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీడీపీ నూతన మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు అన్నారు. మం డల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా మెజారిటీ సభ్యుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీల యూనిట్ ఇన్‌చార్జీల సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు.


మాట్లాడుతున్న డుంబ్రిగుడ అధ్యక్షుడు ఆనందరావు

ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించండి

కొయ్యూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలు తయారు చేయాలని ఎంపీడీవో జీడీవీ ప్రసాద్, తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, ఆర్ఐలతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో రెవెన్యూ రికార్డుల మేరకు ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ప్రస్తుతం వాటి పరిస్థితిపై వివరాలు సేకరించాలన్నారు. అనంతరం తహసీల్దారు, మండల సర్వేయర్‌లతో కూడిన బృందం పరిశీలించి భూముల ఆక్రమణల తొలగింపుపై చర్యలుంటాయన్నారు. ప్రతీ పంచాయతీ భూముల ఆక్రమణల వివరాలను వెంటనే సేకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 23 సచివాలయాల సర్వేయర్లు, 33 పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని ఈ నెల 28 తేదీ లోగా గుర్తించి వివరాలు అందించాలని తహసీల్దార్ వీ మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీ కుమార్, ఎస్ఐ డీ శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలో శనివారం వీఆర్ఏలు, వీఆర్వోలు, సర్వేయర్లు సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ నివేదికల వివరాలను 31 వ తేదీన జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. అనంతరం ఆక్రమదారులకు నోటీసులు జారీ చేసి, తొగింపు చర్యలు చేపడతామని చెప్పారు.


కొయ్యూరు: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

యోగాంధ్ర కార్యక్రమంను విజయవంతం చేయాలి

కొయ్యూరు : యోగాంధ్ర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో జీడీవీ ప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11వయోగా దినోత్సవం పురస్కరించి జూన్ 21 వరకు ప్రతీ గ్రామంలో యోగా నిర్వహణతో పాటు , దీని వల్ల ఆరోగ్యవంతమైన జీవనానికి చేకూరే ప్రయోజనం ప్రజలకు వివరించాలన్నారు. ఇందుకు గానూ సచివాలయ పరిధిలో ఏడుగురుకు యోగాపై శిక్షణ ఇస్తామని , వారు గ్రామాలలో ఒకొక్కరు 50 మందికి శిక్షణ ఇవ్వాలన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

డుంబ్రిగుడ, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారిణి నీ లవేణి తెలిపారు. ముందస్తుగా 750 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసినట్టు వివరించారు. 1121 ఎంటీ రకంతోపాటు1818 రకం విత్తనాలు అందేబాటులోవచ్చాయన్నారు. 1014 రకంతోపాటు ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాలు ఇంకా రావాల్సి ఉందన్నారు.

వెబ్‌సైట్‌లో చిల్డ్రన్స్ హోం దరఖాస్తుదారుల వివరాలు

పాడేరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖలో ఐసీపీఎస్ అండ్ సా, వన్ స్టాప్ సెంటర్, చిల్డ్రన్ హోంల నిర్వాహణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత, అనర్హత వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు కలెక్టర్ దినేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తామన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 26 సాయంత్రంలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

ప్రతి విద్యార్థికి కిట్లు పంపిణీ

» జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి స్వామినాయుడు

అనంతగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని చదువుతున్న ప్రతి విద్యార్థికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పంపిణీ చేయాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ స్వామినాయుడు ఆదేశించారు. మండల కేంద్రంలోని విద్యా కిట్ల స్టాక్‌పాయింట్‌ను శనివారం ఆ యన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఏమేరకు కిట్లు వచ్చాయి? ఇంకా ఎన్ని రావాల్సి ఉందని వివరాలను అడిగితెలుసుకున్నారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను ఆధారంగా కిట్లు పంపిణీ చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో చేరే వారికి కిట్లు అందించేలా హెచ్‌ఎంలకు ఆదేశాలివ్వాలని ఎంఈవో కిల్లో బాలాజీకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు గణేశ్, రవికుమార్, సునీత, అంజనేయు లు, రామకృష్ణ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.


స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న స్వామినాయుడు

పెట్రోల్ బంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాడేరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జీసీసీ, ఐటీడీఏ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెం ట్ అమర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పెట్రోల్ బంక్ ఎం ప్లాయీస్ యూనియన్ నాయకుడు అమర్‌తో కలిసి శనివారం ఐటీడీఏ పీవో డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ ప్రభుత్వ బంక్‌లలో పనిచేస్తున్న ఉ ద్యో గులు కార్మిక చట్టాల అమలుకు నోచుకోవడం లేదన్నారు. జీసీసీ పెట్రోల్ బంకుల్లో గత పదేళ్లుగా సీఎస్ఏలుగా విధులు నిర్వహిస్తున్న వారికి, ఐటీడీఏ బంక్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలుకావడం లేదన్నారు. ఈ రెండు సంస్థల్లోని ఉద్యోగులకు పీఎఫ్ నగదు జమచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాన్ పవర్ ఏజెన్సీ వారు వేతనాలు సక్రమంగా అందించడం లేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, సోమేశ్ కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోడా మోహన్, మత్స్యరాజు, గంగులు, నాయకం బాబు పాల్గొన్నారు.


ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో, జేసీ అభిషేక్‌గౌడకు వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

'సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలి'

పాడేరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని 20 గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో ఎస్ ఆర్ఆర్ టెండర్ సంస్థ ద్వారా పనిచేస్తున్న ఆదివాసీ సెక్యూరిటీ గార్డులకు మూడు నెలల బకాయి వేతనాలు చెల్లిం చాలని ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.సీతమ్మ, కార్యదర్శి ఎం. ప్రశాంతి డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలపై శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల గేట్లు వద్ద సెక్యూరిటీ గార్డులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. యూనిఫాం, బూట్లు, టోపీ, టార్చ్‌లైట్, లాఠీ, రక్షణ పరికరాలు ఇవ్వాలని, మహిళా సెక్యూరిటీ గార్డులకుప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సెక్యూరిటీ గా ర్డుల సంఘం జిల్లా నాయకులు బి.రాజమ్మ, కె.మమత, ఎస్.కస్తూరి, దుర్గ, హేమలత, నిర్మల, లలిత, జ్యోతి, శ్యామల, సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

యోగ శిక్షణకు 236 మంది మాస్టర్ ట్రైనర్లు

పాడేరు, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర- 2025లో భాగంగా ప్రజలకు యోగాపై శిక్షణ ఇచ్చేందుకుగానూ 236 మంది మాస్టర్ ట్రైనర్లు సిద్ధంగా ఉన్నారని యోగా నోడల్ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీవీ లోకేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర- 2025 మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్లుగా, సాధారణ సాధకులు ఆన్‌లైన్ నమోదుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో యోగ శిక్షణ అందించి 236 మంది మాస్టర్ ట్రైనర్లు,మరో 338 మంది ట్రైనర్లు నమోదయ్యాయన్నారు. వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, సిబ్బందికి యోగ సాధనలో శిక్షణ ఇస్తారని నోడల్ అధికారి లోకేశ్వరరావు పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో సీలేరు యువకుడి మృతి

సీలేరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో సీలేరుకు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా గుల్లిపాడు వద్ద జరిగింది. దీంతో సీలేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి జిల్లా జీకేవీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన షేక్‌అలీ మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆలీ కుమారుడు షేక్‌ఆశిక్ విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తిచేసి ద్వితీయ సంవత్సరంలో చేరాడు. శనివారం తుని సమీపంలో గుల్లిపాడు వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఆశిక్ మృతి చెందాడు. ఈ విషయమై తండ్రి ఆలీకి ఫోన్ రావడంతో తన కుమారుడు తుని ఎందుకు వెళ్లాడో.. ఏమి జరిగిందోనని రోదిస్తూ తెలిపాడు. శుక్రవారం కుమారుడు ఫోన్ చేసి కాలేజీ ఫీజు చెల్లించాలని అడిగాడని వెంటనే డబ్బులు పంపించానని ఆలీ తెలిపాడు. ఆశిక్ తుని ఎందుకు వెళ్లాడో తెలియదంటూ భోరున విలపించాడు. అంది వచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల దుఃఖాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారని బంధువులు తెలిపారు.


ఆశిక్ (ఫైల్‌ఫొటో)

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

డుంబ్రిగుడ, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిడి రైల్వే ఎల్‌సీ గేట్ సమీపంలో ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధురాలు నడిచి వెళ్తుండగా గూడ్సు రైలు ఢీకొట్టిందని విజయనగరం జీఆర్‌పీఎస్ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. కురిడి రైల్వే ట్రాక్‌పై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని గిరిజన వృద్ధురాలు నడిచి వెళ్తుండగా గూడ్సు రైలు ఢీకొట్టిందన్నారు. మహిళ వయస్సు 65 ఏళ్లు ఉండవచ్చునన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ 9490617089కు సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ షాహబాద్ అహ్మద్

పాడేరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని డీఎస్పీ షాహబాద్ అహ్మద్ హెచ్చరించారు శనివారం ఆయన పాడేరు పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే, ప్రధాన రహదారుల్లో షాపుల ముందు వాహనాలను నిర్లక్ష్యంగా నిలపడంతో ట్రా ఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాహనాలను పక్కన నిలుపుకోవాలన్నారు. ఇకపై ఎక్కడికక్కడ ఆకస్మికంగా వాహన తనిఖీలను చేస్తామన్నారు. లైసెన్స్ లేకుంటే రూ.10 వేలు, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ. వెయ్యి, ఇన్సూరెన్స్ లేకుంటే రూ. వెయ్యి జరిమానా విధిస్తామన్నారు. ప్రమాదం జరిగితే అందుకు కారణమైన వాహనచోదకుడితో పాటు వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. మ న్యంలో యువత గంజాయికి బానిసలవుతున్నారన్నారు. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎల్.సురేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో యోగా సాధన


యోగ సాధన చేస్తున్న డీఎం ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది

పాడేరు, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర- 2025లో భాగంగా స్థానిక ఆర్‌టీసీ డిపోలో శనివారం యోగా సాధన ప్రక్రియను నిర్వహించారు. డీఎం ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా డీఎం యోగా సాధనతో చేకూరే ప్రయోజనాలను వివరించారు.

కొయ్యూరులో 34.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, మే 24(ఆంధ్రజ్యోతి): మన్యంలో వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం శీతాకాలం, వర్షాకాలాన్ని తలపించే వాతావరణం నెలకొంది. అయినా, ఎండ ప్రభావం తగ్గడం లేదు. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం కొయ్యూరులో 34.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా చింతపల్లిలో 29.7, పాడేరులో 29.5, పెదబయలులో 28.7, హుకుంపేట, జి.మాడుగులలో 28.5, అరకులోయలో 28.4, అనంతగిరిలో 27.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి

» కల్యాణగుమ్మి గిరిజనులు నిరసన


నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మ పంచాయతీ శివారు కళ్యాణగుమ్మికు రహదారి సౌకర్యం లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నామంటూ శనివారం గ్రామ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. నేరళ్లపూడి నుంచి కళ్యాణగుమ్మి గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి, అయితే అటవీ శాఖ అనుమతులులేక పనులు ప్రారంభం కాలేదు. దీంతో అత్యవసర సమయంలోని డోలీమోతలే దిక్కవుతున్నాయని ఈసందర్భంగా గిరిజనులు వాపోయారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా.. రేషన్ సరకులు తెచ్చుకోవాలన్నా తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు డి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 31న బదిలీల కౌన్సెలింగ్

పాడేరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న హెచ్‌ఎంలు, అన్ని కేటగిరిల ఉపాధ్యాయుల బదిలీలకు ఈ నెల 31వ తేదీ శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసినట్టు గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎల్.రజని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎం, అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల బదిలీలకు ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతంలో ఈ నెల 31వ తేదీ నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులన్నారు. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసిన వారు తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ నెల 23వ తేదీ నుంచి 28లోగా డీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. తాత్కాలిక మెరిట్ జాబితాను ఈ నెల 29న ప్రచురిస్తామని, అదే రోజు సాయంత్రం 5వరకు అభ్యంతరాలకు గడువు ఉంటుందన్నారు. తుది మెరిట్ జాబితాను ఈ నెల 30న ప్రకటించి, 31న ఐటీడీఏలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

మారుమూల గ్రామాల్లో వైద్యశిబిరాలు

సీలేరు, మే 24 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫీవర్ సర్వే నిర్వహించారు. లైకన్‌పూర్ గ్రామంలో అనారోగ్యంతో ఉన్న 12 మందికి చంద్రుపల్లిలో 11 మంది రోగులకు వైద్యసేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్‌కే ఖాదర్ మస్తాన్ వలి, హెచ్ఎస్ త్రినాథరావు, సిబ్బంది బాలమణి, సత్యనారాయణ, కొర్రమంగ, కిల్లో రాధా తదితరులు పాల్గొన్నారు.


లైకన్‌పూర్‌లో వైద్య శిబిరం

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరై కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై నివేదికలు సమర్పించారు.

వికసిత అనకాపల్లి జిల్లాగా అభివృద్ధి

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల పనులను మరింత వేగవంతం చేసి వికసిత అనకాపల్లి లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించామని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ కింద 120 లక్షల పని దినాలు బడ్జెట్ అయితే 124.67 లక్షల పని దినాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులకు సూచించినట్టు ఆయన చెప్పారు.

ఇసుక దందాకు అడ్డేలేదు

... 5వ పేజీ తరువాయి

అధికారులు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది.

ఒక రోజు బ్రేక్.. మళ్లీ యథావిధిగా తవ్వకాలు

శేమునాపల్లిలో సాగుతున్న ఇసుక దందాను పరిశీలించేందుకు శుక్రవారం జనసేన నాయకులు వస్తున్నారని సమాచారం తెలియడంతో వాహనాలు అక్కడ నుంచి పంపించేసి, ఇసుక దందాకు ఒక రోజు విరామం ఇచ్చారు. తిరిగి శనివారం ఉదయం నుంచి యథావిధిగా కొనసాగిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా అడ్డగోలుగా సాగుతున్న ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళతా..

శేమునాపల్లి, గవరవరం, లక్కవరం తదితర ప్రాంతాల్లో సాగుతున్న ఇసుక దోపిడీపై సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు జనసేన ఇంచార్జిపీవీఎస్ఎన్ రాజు తెలిపారు. శేమునాపల్లిలో ఇసుక దో పిడీ ఏమాత్రం ఆగకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనగనగా...

... 5వ పేజీ తరువాయి

, ఆలోగానే పిల్లలకు తల్లిదండ్రులు ఆ అలవాటు చేయడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. కథల వల్ల పిల్లల్లో ఊహాశక్తి కూడా మెరుగవుతుంది.

ఓపిక పెరిగే అవకాశం

ప్రస్తుతం పిల్లల్లో ఎవరైనా చెబితే వినే ఓపిక ఉండడం లేదు. కథలు చెప్పడం వల్ల చిన్నతనం నుంచి వినే ఓపిక పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ కథలను వినిపించే అలవాటు వల్ల పిల్లలు ఎవరైనా ఏదైనా చెబితే వినేందుకు ఆసక్తి చూపిస్తారు. పూర్తిగా విన్న తరువాత వాటిపై స్పందించే గుణం కూడా అలవడుతుందని పేర్కొంటున్నారు. వినడం, తరు వాత స్పందించడం అన్నది ఏ వయసులో వారికి అయినా అత్యంత కీలకం. అవతలి వ్యక్తి చెప్పేది పూర్తిగా వినకుండా స్పందించడం అన్నది అనేక అనర్థాలకు దారితీస్తుంది. కథలు చెప్పడం ద్వారా వినే ఓపికను పెంచేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అనేక సంస్థలు..

స్టోరీ టెల్లింగ్‌ను హాబీగా మార్చుకుంటున్న యువత కూడా ఉన్నారు. ప్రస్తుతం వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్టోరీ టెల్లింగ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నారు. అనేక స్కూల్స్ కూడా స్టోరీ టెల్లర్స్‌ను రిక్రూట్ చేసుకుంటున్నాయి. అయితే బయట ఇతరులు చెప్పే స్టోరీల కంటే తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చెప్పే స్టోరీలు పిల్లల మనసుకు హత్తుకుంటాయి. రాత్రి పడుకునే సమయంలో పిల్లలకు ఈ కథలను చెప్పడం వల్ల వారితో అనుబంధం మరింత పెరుగుతుంది. పిల్లలు కూడా ఏదైనా ఇబ్బంది ఉంటే తల్లిదండ్రులతో చెప్పుకునేందుకు ఈ సమయం ఉపయోగపడుతుంది.

మంచి నిద్రకు అవకాశం

రాత్రివేళల్లో పిల్లలు పడుకునే సమయంలో ఈ కథలను చెప్పడం వల్ల మంచి ఆరోగ్యకరమైన నిద్రను పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎంతోమంది పిల్లలు స్మార్ట్ ఫోన్ చూస్తూ, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లతో అర్ధరాత్రి వరకూ ఉంటున్నారు. దీనివల్ల వారికి నిద్ర కరవవుతోంది. ఈ తరహా సమస్యలకు కథ మంచి పరిష్కారంగా నిపుణులు చెబుతున్నారు. పిల్లలను పక్కలో వేసుకుని మీరు చెప్పే కథలు వారిని మంచి నిద్రకు ఉపక్రమించేలా చేస్తాయని పేర్కొంటున్నారు.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా..

ఒకసారి పిల్లలను కథలకు అలవాటు చేస్తే ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అడిగేందుకు కూడా ఆసక్తి చూపించరు. పిల్లలకు చెప్పేందుకు అనుగుణమైన కథలను ప్రతిరోజూ ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ కథలు చెప్పడం రాకపోయినా యూట్యూబ్‌లో అనేక చానెల్స్ ప్రత్యేకంగా కథలను అందిస్తున్నాయి. కొన్ని బుక్స్ కూడా ఉన్నాయి. వీటిని విని లేదా చదివి పిల్లలకు చెప్పవచ్చు. ఒకవేళ చెప్పేంత తీరిక లేకపోతే పిల్లలను పక్కలో వేసుకుని ఆడియో స్పీకర్ ద్వారా వినిపించవచ్చు. అయితే, ఆ కథ వినే క్రమంలో పిల్లలకు వాటి గురించి విశ్లేషించి చెప్పడం అవసరం అని నిపుణులు చెబుతున్నారు.

ఈ సమస్యలకు పరిష్కారం

ప్రస్తుతం ఎంతోమంది పిల్లలు చిన్న వయసు నుంచే హైపర్‌గా రియాక్ట్ కావడం, ఒత్తిడికి గురికావడం, చిరాకు, కోపం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు, గురువులు చెప్పే మాట కూడా వినేందుకు ఆసక్తి చూపించరు. వద్దని వారించినా వినిపించుకోని స్థితిలో ఉన్నారు. కొందరు చిన్నారులు తినేందుకు కూడా ఆసక్తి చూపించరు. ఈ తరహా సమస్యలకు కథలు వినడం పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ఏడాది వయసు నుంచే పిల్లలకు కథలను చెప్పడం అలవాటు చేయాలి.

నైపుణ్యాలను మెరుగుపరచడంలో దోహదం

- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక నిపుణులు

కథలు అనేవి చిన్నారుల్లో అనేక నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఉపయోగపడతాయి. కథలు చదవడం వల్ల పిల్లలకు మేలు కలుగుతుంది. పిల్లల్లో ఆలోచనాత్మక, విశ్లేషణాత్మక శక్తి పెరగడంతోపాటు కొత్త విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది. కొన్ని కథల్లో ఉండే నీతి వారి జీవితాలపై ప్రభావాన్ని చూపిస్తుంది. పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంచడంలో కీలకంగా ఉంటాయి. అలాగే, మాట్లాడే తీరులో మార్పు వస్తుంది. వినే శక్తి, మంచి, చెడులను గుర్తించే సామర్థ్యం కథలతో పెరుగుతుంది. కథలు పట్ల ఆసక్తి పెరిగే చిన్నారులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంటారు. ఇది అనేక అనర్థాల నుంచి చిన్నారులను రక్షిస్తుంది. కాబట్టి, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు ప్రతిరోజూ ఏదో ఒక కథను చెప్పాలి. ఇది వారి జీవితాన్ని మెరుగ్గా మలచేందుకు దోహదం చేస్తుంది.

నర్సీపట్నంలో ఆర్‌ఓఆర్ కోర్టు పునఃప్రారంభం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌ఓఆర్ కేసులు విచారిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌ఓఆర్ కోర్టును శనివారం పునఃప్రారంభించారు. నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ భూహక్కు పత్రాలకు సంబంధించి ఏడు కేసులను విచారించి వాయిదా చేశారు. రెండేళ్ల క్రితం వరకు ఆర్‌వోఆర్ కోర్టుని నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023లో భూ హక్కుల చట్టం ప్రకారం దాఖలైన కేసులను అనకాపల్లి డీఆర్వో కోర్టుకు బదలాయించారు. దీంతో డివిజన్‌లో 12 మండలాల పరిధిలోని కక్షిదారులు వ్యయ ప్రయాసలతో వాయిదా లకు అనకాపల్లి వెళ్లి రావల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పద్ధతిలోనే ఆర్‌ఓఆర్ కోర్టు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆర్డీవో వీవీరమణ ఏడుగురు కక్షిదారులకు నోటీసు జారీ చేశారు. శనివారం ఆర్ ఓఆర్ కోర్టులో విచారించి ఏడు కేసులు వాయిదా వేశారు. భూహక్కు చట్టం ప్రకారం దాఖలైన 366 కేసులు పెండింగ్ ఉన్నాయి.

సీహెచ్‌సీ అనుబంధ భవనం పరిశీలన



ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి అనుబంధంగా ఉన్న భవనాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం పరిశీలించారు. మాడుగుల సీహెచ్‌సీ పక్కన రూ.5.25 లక్షలతో నిర్మాణంలో ఉన్న ఈ భవనం పనుల గురించి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే నెలలో పనులన్నీ పూర్తిచేసి జూలైలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇది అందుబాటులోకి వస్తే మాడుగుల, రావికమతం, చీడికాడ మండలాలతో పాటు గిరిజన గ్రామాల రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆస్పత్రిలో గైనిక్ విభాగంతో పాటు సర్జరీ, అన్ని రక్త పరీక్షలు నిర్వహించేలా వైద్యులు, సిబ్బందిని నియమిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరి దేముడు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, నాయకులు రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, మరువాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాగునీటి కాలువకు కొత్త గేట్ల ఏర్పాటుతో రైతులకు మేలు



ఆయకట్టు గేట్లు ప్రారంభిస్తున్న చైర్మన్, టీడీపీ నాయకులు

కృష్ణాదేవిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ-కొయ్యూరు మండలాలకు చెందిన బంగారంపేట ఆయకట్టు సాగునీటి కాలువ గేట్ల ఏర్పాటుతో 750 ఎకరాల రైతులకు మేలు చేకూరుతుందని గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ అన్నారు. శనివారం బంగారంపేట ఆయకట్టుకు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు గేట్లను ఆయకట్టు చైర్మన్ మువ్వల సత్తిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారం చేపట్టిన ఏడాదిలోనే గొలుగొండ మండలానికి రూ.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో రూ.2.7 కోట్లతో 24 సీసీ రోడ్లు, జడ్పీ హైస్కూల్‌కు భవనం, ప్రహరీ గోడ, సాగునీటి కాలువల్లో పూడికతీత, కొత్తగేట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి రైతులకు రాయితీ దాణా, మూగజీవులకు మందులు, వ్యాక్సిన్లు పంపిణీ జరగక ఎంతో అన్యాయం జరిగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, పోతల రాజులునాయుడు, పైల శివ, అప్పలరాజు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షం..



మాకవరపాలెంలో హోరున కురుస్తున్న వర్షం.. (ఇన్‌సెట్‌లో) గొలుగొండలో జోరు వాన

గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో గొలుగొండ, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం పరిధిలోని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. గొలుగొండ, పాతమల్లంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, జోగంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటలకే వాతావరణం చల్లబడి జల్లులు పడ్డాయి. ఉదయం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురియడంతో వాతావరనం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. మాకవరపాలెం మండలంలో శనివారం ఉదయం భారీ వర్షం పడింది. ఉదయం ఎండ వచ్చినప్పటికీ, తొమ్మిది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతవరణం చల్లబడి భారీ వర్షం పడింది. ఈ వర్షానికి ఉపాధి కూలీలు పనులు నిలిపివేశారు. అలాగే భవన కార్మికులు పనులకు వెళ్లి ఇంటి బాట పట్టారు. సుమారు గంట పాటు వర్షం పడడంతో ఊపిరి తీసుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	513
విజయనగరం	517
శ్రీకాకుళం	517

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. చోడవరం మండల కేంద్రంతో పాటు రావికమతం మండలంలోని కొత్తకోట, బుచ్చెయ్యపేట మండల కేంద్రం, వడ్డాది గ్రామాల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ శిబిరాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ శిక్షణను వినియోగించుకుని ప్రభుత్వం ఇచ్చే కుట్టుమిషన్ ఉచితంగా పొందాలని సూచించారు. శిక్షణ పొందే మహిళలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. 90 రోజుల పాటు వివిధ రకాల దుస్తులు తయారు చేయడాన్ని ఈ కేంద్రం ద్వారా నేర్పుతారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని, కుట్టు శిక్షణలో రాజీ పడవద్దని నిర్వాహకులకు సూచించారు. మహిళలు స్వయం శక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో చోడవరం ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్, ఈవో నారాయణరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ చోడవరం పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, టీడీపీ రావికమతం మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, కొత్తకోట గ్రామ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, మూడు మండలాల నాయకులు బండి నూకరత్నం, నాయుడు, సకురు కోటేశ్వరరావు, ఈర్లె శ్రీను, కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరావు, బంటు శ్రీను, తమరాన దాసు, జి.కోటేశ్వరరావు, దొండా సన్యాసిరావు, దొండా నరేష్, దొండా గిరిబాబు, కోరుకొండ రవి, మరిసా నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో రైస్ కార్డు సేవలు

కార్డులో మార్పుచేర్పులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

మొత్తం ఎనిమిది రకాల సేవలు అందుబాటులోకి

కొత్త కార్డు కోసం ఆప్షన్ లేకపోవడంపై అసంతృప్తి

అమరావతి, మే 24 (ఆంధ్రజ్యోతి): రైస్ కార్డులో మార్పులు చేర్పులు, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకునేందుకు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలు శనివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో ఎనిమిది రకాల సేవలు ఉన్నప్పటికీ, ప్రధానంగా కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇలా దరఖాస్తు చేయాలి...

మొబైల్ ఫోనులో 'మనమిత్ర' వాట్సాప్ చాట్‌లోకి వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే 'సేవను ఎంచుకోండి' అని వస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే 'పౌర సేవను ఎంచుకోండి' అనే బాక్స్‌లో 'సివిల్ సప్లయిస్ సేవలు'పై క్లిక్ చేయాలి. 'దీపం' స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ, రైస్ కార్డులో సభ్యులను జోడించడం, రైస్ కార్డులో సభ్యులను తొలగించడం, తప్పుగా జోడించిన ఆధార్ సీడింగ్ సవరణ, రేషన్ కార్డ్ విభజన దరఖాస్తు.. అనే 8 రకాల సేవలు కనిపిస్తాయి. వీటిలో మీకు అవసరమైన సేవను ఎంపిక చేసుకుని.. వివరాలను పూరించడం ద్వారా వాట్సాప్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు.

జాప్యాన్ని నివారించడానికే...

కొత్త రైస్ కార్డులతో పాటు ఇతర సేవల కోసం ఈ నెల 7వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తుండడంతో ఒత్తిడి పెరిగి సర్వర్లు డౌన్ కావడం, ఇతర సాంకేతిక సమస్యలతో వాటిని ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో రైస్ కార్డు దరఖాస్తులు సమర్పించడానికి వీలుగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఈ నెల 15 నుంచే అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాంకేతికపరమైన కారణాలతో ఈ సేవలను ప్రకటించిన సమయానికి అందుబాటులోకి తీసుకు రాలేకపోయారు. ఎట్టకేలకు శనివారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దరఖాస్తుదారులకు కొంత వెసులుబాటు కల్పించారు.

అయితే ఇందులో కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో, ఇలాంటి వారంతా తప్పనిసరిగా సచివాలయాలకు వెళ్లక తప్పడం లేదు.

ఉగ్రవాదం అణచివేతకు మద్దతుగా నిలవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

చీడికాడలో ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



చీడికాడలో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు

చీడికాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత్‌కు అందరూ మద్దతుగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. చీడికాడ శివాలయం నుంచి చావిడి వరకూ శనివారం సాయంత్రం తిరంగా ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 మంది భారత్ పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చడానికి ప్రతీకారంగా ప్రధాని మోదీ సైనిక శాఖ అధికారులు, మంత్రులతో చర్చించి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలకు చెందిన 170 మంది ఉగ్రవాదులను హతమార్చారని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఉగ్రవాదుల అణచివేతకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా గంగయ్య మాట్లాడుతూ భారతదేశ ఔనత్యాన్ని చాటిచెప్పిన ప్రధాని మోదీకి, దేశ సైనికులకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అంతకు ముందు చీడికాడ శివాలయంలో అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, కూటమి నాయకులు గండి ముసలినాయుడు, మేడపురెడ్డి శ్రీనివాసరావు, కుచ్చు కళావతి, దొగ్గ ఈశ్వర ప్రసాద్, పల్లి అప్పలనాయుడు, బండారు దయాకర్, చిరువూరి శివాజీరాజు, రెడ్డి కొండబాబు, చొక్కాకుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డి.ఫారం భూములకు సుఖీభవ అందించాలి

బుచ్చెయ్యపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): డి.ఫారం పట్టాలు కలిగిన రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అందించాలని మండలంలో రాజాం, లైపురం, తురకలపూడి గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు టీడీపీ నేత కోరుకొండ రవి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం.లక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. డి.ఫారం భూముల సాగుదారులను సుఖీభవ పథకానికి ప్రభుత్వం అనర్హులుగా గుర్తించిందని, తమకు కూడా పథకం వర్తించి న్యాయం చేయాలని వారు విన్నవించారు.

కార్యదర్శులతో ప్రత్యేకాధికారి సమీక్ష

బుచ్చెయ్యపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మండల ప్రత్యేకాధికారి గోపాలరాజు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యం, మంచినీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు, చెత్తసంపద కేంద్ర నిర్వహణ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కూలీల అభిప్రాయంతోనే మేట్ల నియామకం

చీడికాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారుల అభిప్రాయం మేరకే మేట్లను నియమిస్తామని ఎంపీడీవో వి.హేమసుంద్రరావు తెలిపారు. ఈ విషయమై జిల్లా స్పందనలో జేబీ.పురం వేతనదారులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే తేల్చాలని మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజబాబు, స్థానిక నేత దర్మిశెట్టి కొండబాబు శనివారం ఎంపీడీవోతో పాటు ఏపీవో గంగునాయుడులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి వేతనదారుల ఇష్ట ప్రకారమే మేట్లను నియమిస్తామని స్పష్టం చేశారు.

వీఎస్ఎస్‌లకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



అధికారులకు సమస్య తెలుపుతున్న గిరిజనులు

చీడికాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ఉన్న వన సంరక్షణ సమితులకు రహదారి సౌకర్యం కల్పించాలని చీడికాడ శివారు కొండవీధి గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా వేదికలో వినతిపత్రం అందించారు. అయితే రైతులతో మాట్లాడి వచ్చే వారం రావాలని గిరిజనులకు అధికారులు చెప్పారు. అలాగే జైతవరం, చినగోగాడ గ్రామాల్లో భూ తగాదా విషయమై ఫిర్యాదు చేయగా, ఇరువుర్ని విచారణ చేస్తున్నామని తహసీల్దార్ కిశోర్‌లింకన్, ఎంపీడీవో హేమసుందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.రామారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటపతిరాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



దుర్గా ప్రసాద్



సత్యహేమలత

నర్సీపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫలితాల్లో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో కళాశాల విద్యార్థి చీమల దుర్గాప్రసాద్ బీకాం చివరి సంవత్సరంలో ఏయూ స్థాయిలో మొదటి ర్యాంకు, అనిమిరెడ్డి సత్యహేమలత రెండో ర్యాంకు సాధించించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు విద్యార్థులను అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

వివేకానంద విద్యార్థినికి మొదటి ర్యాంక్



విద్యార్థిని ప్రసన్నరాణిని అభినందిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫలితాల్లో వివేకానంద కళాశాల విద్యార్థిని ఎం.లక్ష్మీ ప్రసన్నరాణి బీఏ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. కళాశాల కరస్పాండెంట్ ఏఎస్ఎస్‌జీ దొరబాబు, డైరెక్టర్లు సునీల్ కుమార్, సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ వైఅప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ వైవీ.భాస్కర్‌బాబు, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

విజయాంజనేయ ఆలయ అభివృద్ధికి విరాళం

మాడుగుల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద విజయాంజనేయ ఆలయ అభివృద్ధి కోసం దాతలు రూ.25 వేల విరాళం అందించారు. వాసవీ క్లబ్ చైర్మన్ కొట్యాడ రమేశ్, అరుణ దంపతులు నిర్వాహకులు రాఖీ శ్రీనులకు ఈ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బి.పరమేశ్, స్వామి పాల్గొన్నారు.

కేజే పురంలో ఆక్రమణలు తొలగించాలి

మాడుగుల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం జంక్షన్‌లో రోడ్డు ఆక్రమణలు తొలగించి డ్రైనేజీలు నిర్మించాలని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు, స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. జంక్షన్‌లో కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారని, దానికి ఆనుకుని డ్రైనేజీ నిర్మిస్తే ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెబుతున్నారు. సీసీ రోడ్డుకు కాస్త దూరంగా ఆర్అండ్‌బీ పరిధి వరకు ఆక్రమణలు తొలగించి రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. రోడ్డు ఆక్రమణల తొలగింపుపై మార్చి నెలలో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆర్అండ్‌బీ అధికారులు పరిధి గుర్తించి మార్కింగ్ చేశారని చెప్పారు. ఈ సమస్యను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, ఎంపీడీవో, ఎంఆర్‌వో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

5లోగా అన్ని పాఠశాలలకు పుస్తకాలు

నాతవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నెల 5వ తేదీలోగా పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈవో-2 కె.వరహాలబాబు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలానికి 13 వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. అలాగే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, డిక్షనరీలు అందజేస్తామన్నారు. ఉపాధ్యాయుల బదిలీ ప్రకియ ప్రారంభమైందన్నారు. 73 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉండగా 27 మంది ఎనిమిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారని, వీరికి బదిలీ తప్పదని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి 35 మంది కొత్త ఉపాధ్యాయులను హేతుబద్ధీకరణ చేస్తామన్నారు. ఆయన వెంట చమ్మచింత హైస్కూల్ హెచ్ఎం కె.శివరామప్రసాద్ ఉన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

కె.కోటపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సాంబశివరావు కోరారు. తన చాంబర్‌లో శనివారం సచివాలయ ఉద్యోగుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు యోగాసనాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రతినిధి హేమలత, ఎంఈఓ-2 సత్యనారాయణ, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోతో ఇక్కట్లు

▸▸ ఏడు నెలలుగా భర్తీకాని పోస్టు



తాళాలు వేసి ఉన్న ఎంపీడీవో చాంబర్

నాతవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవో హనుమంతరావు 2024 నవంబరులో బదిలీపై వెళ్లారు. తర్వాత నర్సీపట్నం ఎంపీడీవో ఉషశ్రీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఏడు నెలలుగా స్థానిక ఎంపీడీవో పోస్టును భర్తీ చేయడం లేదు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషశ్రీ మండల పరిషత్ కార్యాలయానికి వారంలో మూడు రోజులకు మించి రావడం లేదని మండల ప్రజలు చెబుతున్నారు. మిగతా రోజుల్లో ఎంపీడీవో కోసం వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్తే తలుపులు మూసి ఉంటున్నాయని, ఇలా నెలలు తరబడి పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించకుండా ఉన్నతాధికారులు తాత్సారం చేయడంతో వివిధ పనులు సకాలంలో పూర్తికాక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలానికి పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించాలని కోరుతున్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

రోలుగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద ఆదివారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి మహేశ్ తెలిపారు. రోలుగుంటతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్య బృందం హాజరువుతుందని, రోగులు విధిగా ఆధార్‌తో రావాలని సూచించారు.